


మా యిద్దరి మధ్య దూరం వంద గజాలు మించకుండా జాగ్రత్తపడుతూ నడుస్తున్నాను. ఇంచుమించు వీధి చివరుంది కమల. మలుపు తిరిగితే కనపడకుండా జనంలో కలిసి పోతుందే మోనన్న కంగారు నాచేత నాలుగడుగులు తొందరగా వేయించింది.

పొద్దున్నించీ వున్న ఆతృత పదింతలైంది. ఏ సంగతీ నిర్ణయించుకో లేకుండా వుంది మనసు. కొంగు నిండుగా కప్పుకుని నడుస్తోంది కమల. ఏ కంగారూ లేదు తన నడకలో.. తాపీగా... మామూలుగా నడుస్తోంది.

"నీ మీద నమ్మకం నాకు నాతో అబద్ధం ఆడలేవన్న ధీమాతోనే నీకీ పని చెపుతున్నాను " అన్న సత్యం నిన్నటి మాటలు గుర్తొస్తున్నాయి. ఇంక రైలు కదులుతుండగా "ఒకవేళ ఆ విషయమే నిజమైతే నా నికృష్టపు బతుకనవసరం ఈ యింటర్వ్యూలు . యీ తాపత్రయాలు " రైలు చప్పుడులో మిగిలిన మాటలు వినపడక పోయినా వాడి భావం పూర్తిగా అర్థమైంది.

అనవసరంగా సాగే ఆలోచనల్ని సాగకుండా ఆపుదామని ఎంత ప్రయత్నిస్తున్నా వీలుకాకుండా వుంది.

కమల ఆగి రిక్షా బేరమాడుతోంది. ఎక్కడికో యింట్లో ఎప్పుడూ చెప్పేట్టు స్నేహితురాలింటికేనా లేకపోతే సత్యం అనుమానిస్తున్నట్టు...

నాకు తెలియకుండానే నా కళ్ళు కంగారుగా రిక్షా కోసం వెతుకుతున్నాయి. తన వెనకాలే వెళ్ళటమా, వద్దా అన్న సందేహం మనసులో కదులుతున్నా, నిముషం పాడు చేయకుండా చేసేపని చేస్తూనే వున్నాను. అది నే చే స్తు న్న ది కాదు... సత్యం స్నేహం చేయిస్తున్నది వాళ్ళింటి పరిస్థితి, యిబ్బందులు తెలిసిన నా మనసు చేయిస్తున్నది.

"ఆ రిక్షా వెనకాలే పోనీ "అన్నాను రిక్షా వాడు అనుమానంగా చూశాడు. అందరికీ అనుమానమే. సత్యానికి కమల మీద అనుమానం - నాకు సత్యం బతుకేమవుతుందో అన్న అనుమానం రిక్షా వాడికి నా మీద అనుమానం.

సత్యం చెప్పిన వివరాల్ని బట్టి కమల స్నేహితురాలిల్లు యిటువేపు కాదు.నాలుగు గంటల సాయంత్రం ఎరడ యింకా చల్లబడలేదు రోడ్డు రద్దీగా వుంది.

"మా పరిస్థితి ఎంత బాగుండక పోయినా..,ఎంత స్నేహమైనా అంతంత డబ్బు ఓ స్నేహితురాలు యివ్వటం ...ఈ సారి ఈ ఇంటర్వ్యూకి కూడా డబ్బు కమల ఆ స్నేహితురాలి దగ్గరే " సత్యం ఇంతకన్నా వివరంగా తన అనుమానం చెప్పలేక పోయాడు నిన్న. అసలు ఆ ఆలోచనే గుండెలు పిండుతుంది. అటువంటిది దాని గురించి వివరాలు చెప్పటం ఏ మగాడికేనా ఇబ్బందే.

రోడ్డు మీద రద్దీకి రిక్షా నెమ్మదిగా వెడుతోంది. టాపు వేసుండటంవల్ల మెడ లాగుతోంది. ముందు కమలున్న రిక్షా దృష్టిలోంచి తప్పి పోతుందేమోనని జాగ్రత్తగా చూట్టం సత్యం మాటలు గుర్తొస్తున్న బాధ చిరాగ్గా వుంది. ఒకటి రెండుసార్లు వెనక్కి వెళ్ళిపోతే అనిపించింది.



సత్యం బాధ నిజం తనంతగా తాను తెలుసుకోటానికి మనసు వొప్పక నాతో సగం చచ్చి వాడు చెప్పటం, గుర్తొచ్చినప్పుడల్లా ఎంత యిబ్బంది పడినా నిజం తెలుసుకోవాలనే వుంది.

నెమ్మదిగా రిక్షా దిగింది కమల. ఇందాకటిలాగే ఏ మాత్రం కంగారు లేకుండా తాపీగా, అతి మామూలుగా నడుస్తోంది హోటల్లోకి. నాలో ఏ భావనా కదలటం లేదు. కాస్సేపు ఆగి నేనూ నడిచాను హోటల్లోకి.

హాలు చివరగా వుందా టేబిల్. కమలని చూడగానే కొద్దిగా లేచాడతను. నల్లగా వున్నాడు. కళ్ళు ఎలా వున్నాయో కనపడకుండా కళ్ళజోడు.

నే కూచున్న చోటునుంచి, నిండుగా కొంగు కప్పుకొంటున్న కమల భుజాలు కనిపిస్తున్నాయి మధ్య మధ్యలో నవ్వుతున్నాడతను.

కప్పుల చప్పుళ్ళని, ప్లేట్ల గొడవనీ యితర్ల మాటలనీ పక్కకి తప్పించాలని ఎంతో ప్రయత్నించేస్తున్నాను.

"సినిమాకని చెప్పివస్తాను ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు, మూడు గంటల కన్నా" కమల గొంతు అంతకన్నా నాకేం వినపళ్ళేదు. నా గుండె చప్పుడు నాకు స్పష్టంగా వినిపిస్తోంది. ఆ హోటల్లో జనమెవ్వరూ లేనట్టు, ఏదో సముద్రం గట్టున మేం ముగ్గరమే భయంకరమైన నిశ్శ

బ్దంలో మిగిలిపోయినట్టు . . ఏమిటో పిచ్చి పిచ్చిగా తయారైంది పరిస్థితి.

అతను జేబులోంచి పర్స్ తీశాడు తీసిన పర్స్‌లోంచి కొన్ని నోట్లు కమలకి...

ఇంక అక్కడ కూచోలేక లేచాను. కమల నన్ను చూడకముందే వెళ్ళిపోవాలన్న హడావిడిలో టేబిల్ మీది నీళ్ళగ్లాసు చప్పుడు నిశ్శబ్దం పగిలిన చప్పుడు.

కమల చూసింది. నేనెంత తల వొంచుకున్నా చూసింది. నేను తన ముఖంచూసిన క్షణంలోనే ఆ కళ్ళల్లో నీళ్లు....ఉద్యోగం కోసం యాడాది నుంచీ యింటర్వ్యూలతో కుస్తీ పడుతున్న సత్యం చచ్చినశవంలా బతుకుతున్న వాళ్ళ తల్లి . స్కూల్ని అల్లరి చోటుగానే తెలిసిన వాళ్ళ తమ్ముడు.. హోటల్ లోంచి బైటి కొచ్చేశాను.

నే నెటు నడుస్తున్నానో నాకే తెలియని స్థితిలో వున్నాను. రేపిపాటికి వస్తాడు సత్యం. రాగానే వాడడిగే ప్రశ్న తెలుసు. ఆ ఆతృతకి వెంటనే సమాధానం కావాలి.

'మరో గతిలేక ఏ నాటి కే నా నీకు వుద్యోగం వస్తుందన్న ఆశతో నీ యింటర్వ్యూల కోసం, సంపాదించే మగ దిక్కులేని మీ యింటి కోసం నీ చెల్లెలు కమల సగం చచ్చి యిలా చేస్తోందని వొళ్ళు బలిసిన వ్యభిచారం కాదని చెపితే విని సత్యం తట్టుకోగలడా.

“ఒకవేళ ఆ విషయమే నిజమైతే యింక నా నికృష్టపు బతుకనవసరం....” సత్యం మనసు నాకు తెలుసు. నేను ఏదో ఒకటి పోగొట్టుకోక తప్పదు. 'వాడి దగ్గర ఏ నిజాన్నీ దాచనని నా మీద సత్యానికున్న నమ్మకం పోగొట్టుకోవాలి. లేదా యీ భయంకరమైన నిజాన్ని చెప్పి వాణ్ణైనా పోగొట్టుకోవాలి.

* * *

సత్యం కళ్ళల్లో ఆతృత తెలుస్తూనే వుంది. అయినా స్టేషన్ దాటే వరకు అడగ లేక పోయాడు. చివరికి గొంతు పెగల్చుకుని, మాటలు పోగేసుకుని అడిగాడు.

“ఏమైందిరా ” అని.

ఏడుస్తున్నట్టు నవ్విన నా నవ్వు నాకు తెలుసు. నేనూ గొంతు పెగల్చు కున్నాను. మాటలు పోగేసుకున్నాను.

“అంతా నీ భ్రమరా నీ దంతా వొట్టి అనుమానం కమల ఫ్రెండ్‌ని కూడా చూశాను ” అన్నాను.

